క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు సహకారం అందిస్తాం

మన్సూరాబాద్, నవంబర్ 19: తెలంగాణ స్పోర్ట్స్ అథార్టీ తరపున నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావల్సిన సదుపాయాలు కల్పిస్తానని టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ హామీనిచ్చినట్లు నోసా ప్రెసిడెంట్ కందికంటి కన్నాగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ తెలిపారు. నాగోల్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వారు మాట్లాడుతూ సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ప్రొ కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు నాలోల్ ప్రభుత్వ విద్యార్థులు అర్హత సాధించడం ఎంతో అభినందనీయమని వారిని సుశిక్షుతులైన క్రీడాకారులకు తీర్చిదిద్దడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఈటీల పాత్ర ప్రధానమైందన్నారు. ప్రొ కబడ్డీ పోటీల్లో రాణించిన విద్యార్థులతో పాటు ఇతర విభాగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థుల ఎదుగుదలకు సహకారం అందిస్తానని మధుయాష్కిగౌడ్ ప్రధానోపాధ్యాయుడికి ఫోన్ ద్వార సమాచారం ఇచ్చారన్నారు. పూర్వ విద్యార్థులుగా పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములమవుతున్నామని తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30 నుంచి, ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19 : ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.శశికాంత్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈనెల 21 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుంతో 23వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ల ఇష్టా రాజ్యం

- అధికారుల అనుమతి లేకుండానే రికార్డులు తీసుకుపోతున్న కాంట్రాక్టర్లు
- అటెండర్లు ఉండగా కాంట్రాక్టర్లు ఫైల్స్ తీసుకపోవడం ఏమిటీ
- రికార్డులు తారుమారు అయితే బాధ్యులు ఎవరు
- ఎంబీ రికార్డులు కాంట్రాక్టర్ చేతికి ఎలా ఇస్తారు
- బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో రికార్డులకు రక్షణ ఏది?

బడంగ్‌పేట,నవంబర్19 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల అసలత్వంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం అయింది. కాంట్రాక్టర్లే నేరుగా రికార్డులు తీసుకుపోవడం పట్ల తీవ్ర దుమారం లేచ్చింది. డివిజన్లలలో అభివృద్ధి పనులు నడుస్తుండగానే ఎంబీ రికార్డులు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. అధికారులతో పాటు కుర్చిలో కూర్చొని కాంట్రాక్టర్లే ఫైల్స్ మూపెంటు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో పని ఎంత వరకు చేశారో సదరు అధికారి ఆపనిని పరిశీలించి ఆ తర్వాత ఎంబీ రికార్డు చేయవల్సి ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా బడంగ్‌పేటలో మాత్రం కాంట్రాక్టర్లు రికార్డు గదిలోనే పొద్దంతా తిష్ట వేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల దగ్గర, వర్క్ ఇన్‌స్పెక్టర్ల దగ్గర, రికార్డు రూమ్‌లలో ఎటు చూసినా కాంట్రాక్టర్లే దర్శనం ఇస్తున్నారు. చేసిన పనిని ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు రికార్డు చేసిన తర్వాత ఆ ఫైల్‌ను అటెండర్ ద్వారా సంబంధిత అధికారులకు ఆ ఫైల్ చేరవేయవల్సి ఉంటుంది. అటెండర్‌కు సంబంధం లేకుండానే రికార్డు గదిలోకి పోయి కాంట్రాక్టరే ఎంబీ రికార్డులు తీసుకొని నేరుగా ఏఈ, డీఈల దగ్గరకు తీసుక పోవడం ఆనవాయితీగా మారిపోయింది. ఇదంతా పైఅధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఇదంతా జరుగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇంజినీరింగ్ విభాగంలో అధికారులే రికార్డులు రాసుకుంటున్న దృశ్యం

ఎంబీ రికార్డులు కాంట్రాక్టర్లు తీసుక పోవడంపై ఓ అధికారి అభ్యంతరం

ఇంజినీరింగ్ విభాగం నుంచి ఎంబీ రికార్డులను మంగళవారం ఓ కాంట్రాక్టరు తీసుకపోవడం పట్ల ఓ అధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు నేరుగా ఎంబీ రికార్డులు తీసుకొని పోతే ఎలా అని ఓ అధికారి ప్రశ్నించారు. అటెండర్లు ఉండగా కాంట్రాక్టర్లు ఎందుకు రికార్డులు పట్టుకొని తిరుగుతున్నారన్నారు. ఆ కాంట్రాక్టర్ నవ్వుతూ అధికారి వైపు చూస్తూ బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అటెండర్లు ఎవరు పనిచేస్తార్ సార్ అంటూ సమాధానం ఇచ్చారు.

ఇంజినీరింగ్ అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం కారణంగానే కాంట్రాక్టర్లు పాడిందే పాట ఆడిందే ఆటగా మారిపోయిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు అధికారులు కూర్చునే కుర్చీలలో కూర్చొని రికార్డులు వారే రాసుకుంటే ఇక అధికారులు ఎందుకు అన్న సందేహాలు వస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్ర వరకు కాంట్రాక్టర్లు ఇంజినీరింగ్ సెక్షన్‌లో తిష్ట వేస్తున్నారు.

క్రమ పద్ధతిలో ఫైల్ కావడంలేదు

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో క్రమ పద్ధతిలో ఫైల్ కావడంలేదని కొంత మంది కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ముందు పని చేసిన వారి బిల్లులు చేయకుండా అధికారులకు ఎవరు చేతులు తడిపితే వారి ఫైల్స్ ముందు అవుతున్నాయని కొంతమంది కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసినం కాదా బిల్లులు వారే ఇస్తారనుకుంటే సంవత్సరాలు గడిచినా బిల్లులు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. అధికారులకు పై నుంచి పోన్లు వచ్చిన వారి ఫైల్స్ త్వరగా కదులుతాయన్న విమర్శలు వస్తున్నాయి.

బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. బీఈ (ఏఎంసీటీఈ) బ్రిడ్జి కోర్సు సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మెమోను రెండు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి 25లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.200 అపరాధ రుసుంతో 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి 26లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎర్రకుంట పునరుద్ధరణ షురూ..

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19 : తార్నాక డివిజన్‌లోని ఎర్రకుంట చెరువు పునరుద్ధరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మారేడ్‌పల్లి మండలం పరిధిలోని 5.9 ఎకరాల్లో ఉన్న ఎర్రకుంట చెరువు పునరుద్ధరణకు గతంలో మార్కింగ్ చేశారు. చెరువు ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించారు. ఈ నేపథ్యంలో గతంలో మార్కింగ్ చేసిన 5.9 ఎకరాల్లోని పిచ్చి మొక్కలు, చెట్లను జేసీబీలతో తొలగించారు. ఇరిగేషన్ అధికారులు, మారేడ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది పనులను చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ సుధీర్ మాట్లాడుతూ.. త్వరలోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఆక్రమణలపై సైతం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్, నవంబర్ 19 : మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఎల్బీనగర్ జోన్ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యపై ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పర్మినెంట్ అయ్యేవరకు వారికి రూ. 26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఒక రోజు అత్యవసరంగా డుమ్మా కొడితే వీక్లీ ఆఫ్ రోజు వేతనం కూడా కార్మికులకు కట్ చేస్తున్నారన్నారు. కార్మికులకు ఆరు నెలలకు ఒక కిట్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ మున్సిపల్ సంఘం అధ్యక్షురాలు యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎం. మద్దిలేటి, రమావత్ సక్రునాయక్, బొయపల్లి రాములు గౌడ్, కరుణాచారి, రవి, కృష్ణవేణి, కనకమ్మ, పద్మ, సావిత్రి, లక్ష్మి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో సంకటహర చతుర్థి

హనుమాన్ ఆలయంలో నిర్వహించిన సామూహిక గణపతి హోమంలో దృశ్యం

చంపాపేట, నవంబర్ 19 : సంకటహర చతుర్థి సందర్భంగా మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో సంకటహర చతుర్థిని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు రాచర్ల చంద్రకాంత్ శర్మ, అర్చకులు కందాల సంతోష్‌కుమార్, జి శ్రీనివాస్ సామూహిక గణపతి హోమం నిర్వహించి మూలవిరాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ప్రాతఃకాల ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు యాదగిరి, మేక సురేందర్‌రెడ్డి, బబ్బూరి ఆనంద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

సైదాబాద్, నబంబర్ 19 : సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలోని పలువురికి షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. మంగళవారం పాతబస్తీలోని ఫంజేషాలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 87 మంది లబ్ధిదారులకు రూ. 87 లక్షల పది వేలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేద ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వియోగం చేసుకోవాలన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికలో పాల్గొన్న బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

వనస్థలిపురం, నవంబర్ 19: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం గాయత్రీభవన్‌లో మంగళవారం నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల 16వ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది.
ఈ కార్యక్రమంలో 770 మంది నమోదు చేసుకున్నారు. ప్రాంగణంలోనే 35 మందికి వివాహాలు కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగ పెళ్లి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సి ప్రభాకర్‌రావు, ఎంవీ శాస్త్రి, జగన్‌మోహన్ శర్మ, చింతపల్లి మంగపతిరావు, పోచంపల్లి శ్రీధర్‌రావు, రామగిరి చంద్రశేఖర్‌రావు, పోగుల రాంబాబు, వాసుదేవరావు, రమణరావు, యాదగిరిరావు, జగన్నాథరావు, సోమయాజులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

1న మాలల సింహగర్జన

జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల సింహగర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బడంగ్‌పేట, నవంబర్ 19 : హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో తలపెట్టిన మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గజ్జల రాంచందర్ పిలుపు నిచ్చారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి యంగల యాదగిరి ఆధ్వర్యంలో మాలల సింహగర్జన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 1న జరిగే మాలల సింహ గర్జన సభకు మాలలందరూ ఎక్కువ సంఖ్యల్లో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైబీమ్ నాయకుడు బల్వంత్ రావు, మన్నె శ్రీధర్, దళిత ఉద్యమ నాయకులు రాజలింగం, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, మేకల పాండు, బాలకృష్ణ, మదన్ మోహన్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిపై దాడి.. ఇద్దరి అరెస్టు

ఎల్బీనగర్, నవంబర్ 19: ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు యత్నించిన ఇద్దరిని చైతన్యపురి పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి కథనం ప్రకారం.. ఆర్కేపురం నివాసి వెంకటరమణి ఇంటికి గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆదివారం ఇంట్లోకి చొరబడి గడియ పెట్టి ఆమెపై దాడికి దిగి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు యత్నించాడు. ఈ ఘటనలో వృద్ధురాలు గాయాలకు గురైనప్పటికీ తన మెడలోని బంగారు గొలుసు, చంద్రహారం లాక్కున్న దొంగతో ప్రతిఘటించి తిరిగి లాక్కోవడంతో పాటుగా గట్టిగా అరవడంతో నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. ఈ మేరకు ఈ విషయాన్ని సోమవారం ఉదయం చైతన్యపురి పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన చైతన్యపురి పోలీసులు సీసీ కెమెరాలు, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా 24 గంటలలోపే ఈ సంఘటనకు బాధ్యులైన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.
ఈ ఘటనలో స్నేహపురి కాలనీకి చెందిన మోముల సంఘమేష్ (22), కామారెడ్డి కి చెందిన విస్లావత్ వంశీ (16)లను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్

చెక్కు అందజేత

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త అన్నారు. ఆబిడ్స్‌కు చెందిన డి. హనీసింగ్‌కు రూ. 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త కొత్తపేటలోని తన నివాసంలో అందజేశారు.
– ఎల్బీనగర్, నవంబర్ 19

లీగస్ సెల్ జిల్లా కన్వీనర్ల నియామకం

రంగారెడ్డి జిల్లా కోర్టులు,నవంబర్ 19(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్లుగా ఎడ్ల భరత్‌రెడ్డి, కొమ్మూరి గాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, జిల్లా జాయింట్ కన్వీనర్లుగా పాలకూరి సుధాలను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బొడ్డు భిక్షపతిగౌడ్, పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.కొండల్‌రెడ్డిలు నియామక పత్రాలను అందజేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు పులిజాల సురేష్‌కుమార్, ఉంగరాల శంకరయ్య,రమణరావు,జలకం కిశోర్‌కుమార్, జగన్ మోహన్‌రెడ్డి,ప్రసాద్, వెంకటరమణతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాద నివారణకు చర్యలు

కందుకూరు, నవంబర్ 19: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల పరిధిలోని బాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో గల ప్రధాన రోడ్డుపై భారీకేడ్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పులిమామిడి, నేదునూరు గ్రామం నుంచి తమ గ్రామం రహదారి మీదుగా వెళ్తున్న వాహనాలు అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకొని భారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొంతం బాల్‌రెడ్డి,ఆరోగ్యరెడ్డి, కప్పాటి అంజిరెడ్డి, మల్లగాల్ల విజయ్ , ప్రభు,కుమ్మరి అంజయ్య,కుమార్, శంకరయ్య, రాంచంద్రయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

- 'పది'లో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించాలి
- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి
- సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- మహేశ్వరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

మహేశ్వరం,నవంబర్19 : విద్యార్థులు సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం తయారు చేసిన సిబ్బందితో మాట్లాడారు. వండిన వంటలను ఆయన రుచి చూశారు. మరుగు దొడ్లు, టాయిలెట్స్‌ను ఆయన పరిశీలించారు. రోజుకు రెండు సార్లు స్కావెంజర్లు క్లీన్ చేయాలన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు కష్ట పడి పాఠశాలలకు పంపిస్తున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలంటే భాగా కష్టపడి చదువుకోవాలన్నారు.
15 ఏండ్ల నుంచి 25 ఏండ్ల వరకు క్రమ శిక్షణ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. క్రమ శిక్షణ గల విద్యార్థులే జీవితంలో స్థరపడుతారన్నారు. జీవితంలో ఎదగడానికి పదవ తరగతి తొలిమెట్టు అన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా అర్థం చేసుకొని కసి, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజా రెడ్డి, ఎంఈవో నాయక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్ : ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శంకర్‌నగర్, 11కేవీ గడ్డి అన్నారం,11కేవీ తిరుమల హిల్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ పల్టన్, 11కేవీ ఆంధ్రాబ్యాంక్ కాలనీ, 11కేవీ శివ గంగా కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యా హ్నం 2ః 30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతి నగర్ తదితర బస్తీల్లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. సబర్మతి నగర్ బస్తీలో కలుషిత నీటిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ మంగళవారం వాటర్ వర్క్స్ మేనేజర్ మల్లేశ్‌తో కలిసి సమస్యను పరిశీలించారు. వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు.

అవమానకరంగా ప్రచారం చేశారంటూ మహిళ ఆత్మహత్య

సైదాబాద్, నబంబర్ 19 : ఇంటి ఓనర్ కోడలు తన పట్ల అసభ్యకరంగా స్థానికులకు తప్పుడు ప్రచారం చేస్తుందని అవమానంగా భావించిన ఓ వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. రెండు రోజులపాటు దవాఖానలో చికిత్స పొంది డిచార్జి సమయంలో ఆమె మానస్థాపంతో అదే దవాఖానలోని నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్‌కు చెందిన చాకలి కృష్ణ, దివ్యశ్రీ (28) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. ఆదివారం రాయిచూర్‌లో బంధువుల వివాహానికి భర్త వెళ్లాడు. ఇంటి ఓనర్ కోడలు తన పట్ల ప్రచారం చేస్తుందంటూ భర్తకు ఫోన్‌లో చెప్పి బాధ పడింది. తాను రాయిచూర్ నుంచి వచ్చిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుతానని భర్త నచ్చజెప్పటికీ, పిల్లలను మంచిగా చూసుకోవాలని చెప్పి ఫోన్ కట్ చేసింది. సుమానం వచ్చిన భర్త తన స్నేహితుడు నరేష్‌కి ఫోన్ చేసి ఇంటికెళ్లాలని చెప్పాడు. దీంతో ఆతను ఇంటికి వచ్చేసరికి తలుపువేసి ఉండటంతో వాటిని బద్దలు కొట్టి చూడగా, దివ్యశ్రీ ఏషియన్ పెయింటింగ్‌కు సంబంధించిన కెమికల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పంది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం చంపాపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రెండు రోజులపాటు చికిత్స పొందిన ఆమెను డిజార్జ్ చేయటంతో బిల్లు చెల్లించడానికి భర్త వెళ్లాడు. ఆ సమయంలో ఆమె దవాఖాన నాలుగవ అంతస్తుకు వెళ్లి కిందకు దూకింది. బిల్లు చెల్లించి వచ్చేసరికి భార్య కనిపించకపోవటంతో ఆమె కోసం భర్త దవాఖానలో వెతికారు. బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో దివ్యశ్రీ విగతజీవిగా కనిపించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి

చిక్కడపల్లి, నవంబర్ 19 : పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. బాలల దినోత్సవం నేపథ్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నవ తెలంగాణ పబ్లిషికంగ్ హౌస్ ఆధ్వర్యంలో పిల్లల పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ రియాజ్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్య